క్లుప్తంగా

హెల్త్ సబ్ సెంటర్ పరిశీలన



దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లిలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్‌ను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వేసవిని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే స్థానికంగా ఉన్న ఆస్పత్రుల్లో చూయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆయన వెంట సబ్ సెంటర్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సదాశివనగర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రాజిరెడ్డి అన్నారు. మండలంలోని కుప్రియాల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం శనివారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ, గ్రామ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హనుమాన్ పారాయణం, చాలీసాను పఠించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు పాలిసెట్ కోచింగ్ బుక్స్ పంపిణీ



కామారెడ్డి టౌన్: తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌కే కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్ కోచింగ్ బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్, ఖలీల్, సమీర్, రాజు, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తరుగు పేరుతో రైతులను మోసం చేయవద్దు



కామారెడ్డి టౌన్: రైస్ మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోపిడికి గురి చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరుగు పేరుతో తూకంలో కిలో చొప్పున కట్ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అధికారులు విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు బన్సీలాల్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.


లచ్చాపేటలో పశువైద్య శిబిరం



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేటలో కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 60 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవికాలంలో పశువులపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశు వైద్యులు రవికిరణ్, అనిల్‌రెడ్డి పశువుల పెంపకందారులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మి, వైస్ చైర్మన్ మినుకూరి బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పూల్‌చంద్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మక్బూల్, నారా గౌడ్, రాజలింగం, సుదర్శన్ రావు, గోగు జ్యోతిరెడ్డి, వీడీసీ చైర్మన్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీరేదెలా?

- సాసర్ పిట్‌లలో నీళ్లు నింపని అటవీశాఖ అధికారులు
- గ్రామ శివార్లలోకి వస్తున్న వన్యప్రాణులు
- ఇబ్బంది పడుతున్న రైతులు, గ్రామస్తులు



లింగంపేట శివారులోని గంగమ్మ గుడి వద్దకు నీటి కోసం వచ్చిన ఎలుగుబంటి



అటవీ ప్రాంతంలో నీళ్లు లేక వృథాగా ఉన్న సాసర్ పిట్

లింగంపేట: వేసవి ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. అటవీ ప్రాంతాల్లోని చెరువులు, నీటి గుంతల్లో నీరు అడుగంటిపోవడంతో అడవుల్లో జీవిస్తున్న వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామాల శివారులోని బోరుబావులు, ఊర చెరువుల వద్దకు వస్తున్నాయి. దీంతో పంట చేనుల్లో బోరుబావుల వద్ద కాపలాగా ఉంటున్న రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పంట చేనుల వద్ద పశువుల పాకల్లో కట్టేసిన దూడలను రాత్రివేళ నీటి కోసం వస్తున్న చిరుతలు దాడి చేసి హతమారుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చడంలో అటవీ శాఖ అధికారులు విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో 62 సాసర్ పిట్‌లు ఉన్నాయి. వందలాది అటవీ జంతువులు తాగునీటి కోసం సాసర్ పిట్‌ల వద్దకు రాత్రివేళ చేరుకుంటాయి. అందులో నీరు లేకపోవడంతో గ్రామాల శివారులోని బోరుబావులు, పంట కాలువలు, ఊర చెరువుల వద్దకు వచ్చి నీళ్లు తాగి వెళ్తున్నాయి. వేసవి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఎక్కడ సాసర్ పిట్‌లలో అటవీ శాఖ అధికారులు నీళ్లు నింపడం లేదు. కామారెడ్డి జిల్లాలో 82,130 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉండగా లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, తాడ్వాయి, మండలాల్లో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో చెట్లు నరికేసిన ఖాళీ ప్రదేశాల్లో కొత్త మొక్కలు నాటడంలో అటవీ శాఖ విఫలమవుతోందనే ఆరోపణలు ఉన్నాయి. వందల ఎకరాల్లో చెట్లను నరికేస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అడవుల్లో ఉండాల్సిన జంతువులు గ్రామాల వద్దకు వస్తున్నాయి.

అటవీ జంతువులను కాపాడాలి

లింగంపేట మండలంలోని మెంగారం, బోనాల్, చింతల్‌గుట్ట తండా, నల్లమడుగు, భవానిపేట, ముంబోజిపేట, కొండాపూర్, జల్దిపల్లి, రాంపూర్, కంచుమల్, పోతాయిపల్లి, కోమట్‌పల్లి తదితర గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో వందలాది అటవీ జంతువులు నివాసం ఉంటున్నాయి. అడవుల్లో తాగునీరు లేకపోవడంతో గ్రామాల శివారులోని పంట చేనుల వద్దకు వస్తున్నాయి. కొన్ని రోజులుగా చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, కొండగొర్రెలు, కుందేళ్లు, నీల్‌గాయ్‌లు, దుప్పిలు, తోడేళ్లు, అడవిపందులు తదితర జంతువులు పంట పొలాలకు వచ్చి నీళ్లు తాగి వెళ్తున్నాయి. ఇదే అదునుగా చూసుకొని వేటగాళ్లు రెచ్చిపోతూ జంతువులను వేటాడి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అటవీ ప్రాంతాల్లోని సాసర్ పిట్‌లలో నీటిని నింపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బడ్జెట్ రాలేదు

సాసర్ పిట్‌లలో నీటిని నింపడానికి బడ్జెట్ రాలేదు. ప్రతి ఏటా వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి సాసర్ పిట్‌లలో నీటిని నింపుతాము. ఈ సారి నిధులు రాకపోవడంతో ఆలస్యమైంది. ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాల పరిధిలోని అడవుల్లోని సాసర్ పిట్‌లలో నీటిని నింపడానికి కృషి చేస్తున్నాం. త్వరలో అటవీ ప్రాంతాల్లోని సాసర్ పిట్‌లలో నీటిని నింపడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– ఓంకార్, ఎఫ్ఆర్‌వో

వారోత్సవాలను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

బాన్సువాడ రూరల్: విద్యుత్ భద్రతా వారోత్సవాలను విజయవంతం చేయాలని ట్రాన్స్‌కో డీఈ ఎస్ ప్రభాకర్‌రావు కోరారు. శనివారం దేశాయిపేట్ రైతువేదికలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, పిట్లం, నిజాంసాగర్ మండలాలకు చెందిన విద్యుత్ ఉద్యోగులకు విద్యుత్ భద్రతా వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. వానలు, ఈదురు గాలులు సంభవించినప్పుడు తీగలు తెగిపోవడం, సాగడం, స్తంభాలు విరిగితే సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాన్సువాడ ఏడీఈ సంజీవ్‌రావు, బాన్సువాడ టౌన్ ఏఈ టౌన్ సంతోష్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



మడేలేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కామారెడ్డి అర్బన్: పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున మడేలేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం 108 కలశాలతో విగ్రహమూర్తులకు మహాన్నవనం, వాస్తు నవగ్రహ యోగినీ క్షేత్రపాలక భద్రమండప హోమం, యంత్ర సంస్కారం కార్యక్రమాలు చేపట్టారు.

సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, రుద్రహోమం, శయ్యాధివాసం, తీర్థప్రసాదాల వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు మహేశ్, అశోక్ , రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మక్కల ఆరబోత

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు



చందాపూర్-సంగోజీవాడి రహదారిపై మక్కలపై కప్పిన టార్పాలిన్లు

తాడ్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుపై మక్కలు, వడ్లు ఆరబోయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తాము పండించిన పచ్చి మక్కలను ఎండబెట్టడానికి రహదారిపై పోస్తున్నారు. అధికారులు, పోలీసులు పంట దినుసులను రోడ్లపై ఆరబెట్టవద్దని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఆరబోసిన మక్కలు, వడ్లపై నల్లటి కవర్ కప్పుతుండడంతో గమనించని వాహనదారులు దాని మీదుగా ప్రయాణం కొనసాగించడంతో అదుపు తప్పి కిందపడిపోతున్నారు. ఈ ఘటనల్లో పలువురికి తీవ్రగాయాలైన సందర్భాలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హెల్త్ కార్డులు పొందాలి

ఎల్లారెడ్డిరూరల్: ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పొందని వారు ఆధార్ కార్డులను తీసుకొచ్చి హెల్త్ కార్డులను పొందాలని పల్లె దవాఖానా వైద్యులు శివకృష్ణ శనివారం తెలిపారు. మండలంలోని హెల్త్ కార్డులు లేని వారు వెంటనే ఆధార్‌కార్డులతో పల్లె దవాఖానాలో సంప్రదించి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

జనగణనలో కులగణనను స్వాగతిస్తున్నాం



తాడ్వాయి: కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేస్తామనడాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



బిచ్కుంద: మండలంలోని గుండెకల్లూర్‌లో ఇందిర్మ ఇళ్లను ఎంపీడీవో గోపాల్ శనివారం పరిశీలించారు. గుండెకల్లూర్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో ప్రభుత్వం 111 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో ఇళ్లను నిర్మించుకోడానికి ముందుకు వచ్చారు. 15 మంది పనులు ప్రారంభించారు. ఇద్దరికి మంజూరైన బిల్లులను అందించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని అర్హులకు ఇళ్లు మంజూరవుతాయని అన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలం నర్వగేటు వద్ద ఇసుక టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ శనివారం తెలిపారు. మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్‌ను పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పేదింటి ఆడపిల్లలకు వరం ‘కల్యాణలక్ష్మి’

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: పేదింటి ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకమని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో బాన్సువాడ, బాన్సువాడ రూరల్, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం హర్షనీయమని అన్నారు. మూడు మండలాలకు చెందిన 122 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌నాయక్, జంగం గంగాధర్, అంజిరెడ్డి, ఎజాస్, నర్సింలు, శ్యామల, బోయిని శంకర్, కాశీరాం, గౌస్, మన్నన్, సుధాకర్‌రెడ్డి, కంది మల్లేశ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కుప్రియాల్‌లో ఘనంగా బోనాల పండుగ



సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్‌లో గ్రామస్తులు గ్రామదేవలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకొని, అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వీడీసీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం





ఎర్రాపహాడ్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు.. బిచ్కుందలో..

తాడ్వాయి/ బిచ్కుంద: తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌లో శనివారం పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంగారెడ్డి, వీడీసీ చైర్మన్ మోహన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, రాజలింగం, సుధుసూదన్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గ్రామపెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సాబెరా బేగం, ఉపాధ్యాయులు వాజిద్ హుస్సేన్, లతీఫొద్దీన్, అహ్మద్, అలియా బేగం, అలాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాలీబాల్ సమ్మర్ క్యాంపు



తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్ కొనసాగుతోంది. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని పలువురు క్రీడాకారులు పేర్కొన్నారు. అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు గైని రాజలింగం క్రీడాకారులకు వాలీబాల్‌ను విరాళంగా అందజేశారు. గ్రామపెద్దలు రాజలింగం, బాలాజీ, నాగరాజు, బాలురాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



లింగంపేట: మండలంలోని అయ్యపల్లి తండా శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేశ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. గ్రామ శివారులో చేపల చెరువు పనులు కొలతల ప్రకారం చేయాలని ఆదేశించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె నోటీసును కమిషనర్‌కు అందజేస్తున్న కార్మికులు



ఏవోకు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజనర్సు పిలుపునిచ్చారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి సమ్మె నోటీసును శనివారం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఏవోకు సమ్మె నోటీసు అందజేత

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాల్‌రాజ్ కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో అహ్మద్ మసూర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దశరథ్, కృష్ణ, సాయిలు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తోట గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులలో ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం ఈనెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా 26న అడ్మిషన్ల జాబితాను ప్రకటిస్తామని, 27 నుంచి 31 వరకు అడ్మిషన్ల జాబితాలో పేర్లు వచ్చిన వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పేర్కొన్నారు. మెరిట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని అన్నారు.

బోరు మోటార్ల కేబుల్ చోరీ

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లో శుక్రవారం రాత్రి బోరు మోటార్ల కేబుల్ వైర్లను దుండగులు దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. గ్రామంలోని 25బోరు మోటార్ల కేబుల్ వైర్లను కత్తిరించి చోరీ చేసినట్లు రైతులు వివరించారు. పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

కాటేపల్లి తండాలో పశువులకు టీకాలు



పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి తండాలో పశువులకు శనివారం ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామంలోని 143 ఆవులకు, 366 గేదెలకు ఉచితంగా టీకాలు ఇచ్చినట్లు తెలిపారు. పశువుల పెంపకందారులు పశువుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సిబ్బంది రవి, రైతులు బామన్ భారత్ నాయక్, జేతిలాల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను శుభ్రం చేయరా..?



నస్రుల్లాబాద్: మండలంలోని అంకోల్ తండాలో మురికి కాలువలు పూర్తిగా చెత్తతో నిండిపోయాయి. దీంతో వీధులన్నీ కంపు కొడుతున్నాయి. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో మురికి కాలువకు చెత్త అడ్డం వచ్చి దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నా రు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.